



అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 27 జూలై 2025 పేజీలు : 04


# పేదల అభివృద్ధికి పి4 పాలసీ రాజమార్గం

- బంగారు కుటుంబాలు, మార్గదర్శకులను గుర్తించండి : జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్



పి4 సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్ చేతన్

**లేపాక్షి, జూలై 26 ప్రభాతవార్త**

పేదల అభివృద్ధికి పి4 పాలసీ రాజమార్గమని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శకులను వేగంగా గుర్తించి నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. శనివారం మండలంలోని కంచి సముద్రంలో పి4 కార్యక్రమంపై జరిగిన గ్రామసభలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని పలు సూచనలు అందచేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ మాట్లాడుతూ పి4 పాలసీ ద్వారా పేదల జీవితాల్లో మార్పులు తీసుకువచ్చి గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని విద్యావంతులు, ఎన్ఆర్ఐలు, ఉపాధ్యాయులు, సంపన్నులు ఇందులో భాగస్వాములై పేదరిక నిర్మూలనకు సహకరించాలని కోరారు. పి4 పాలసీ కింద "బంగారు కుటుంబాల దత్తత", మార్గదర్శుల ఎంపిక, లబ్ధిదారుల నమోదు వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యా, ఆరోగ్య, ఆర్థిక రంగాల్లో వెనుకబడినవారికి చేయూతనిస్తూ, వారి జీవితాలను ఉన్నత స్థానాలకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనను ముఖ్య లక్ష్యంగా చేసుకుని "జీరో పావర్టీ - పి4 పాలసీ" అమలుకు కృతనిశ్చయంతో ముందడుగు వేస్తోందన్నారు. ప్రభుత్వం, ప్రజలు, దాతలు కలిసి పనిచేస్తే సమాజంలో అట్టడుగున వున్న 20 శాతం పేద కుటుంబాలను, అత్యున్నతంగా వున్న 10 శాతం సంపన్నుల సహకారంతో అభివృద్ధి చేయడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వచ్చే ఐదేళ్లలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పి4 కార్యక్రమాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా వెనుకబడిన కుటుంబాలకు విద్య, ఆరోగ్యం, ఆర్థిక, జీవనోపాధి రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గ్రామస్థాయిలో అసమానతలు తగ్గించేందుకు, వనరులను సమర్థంగా వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేదరికాన్ని తగ్గించడమే కాక, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యమన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ పేదవారికి ఏదో ఒక రూపంలో మేలు చేసే ధోరణి పెరగాలని, ఉన్నవారు తమ శక్తి సామర్థ్యాన్ని అవసరమున్న వారికి అనుసంధానించి, పి4 విధానాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పి4 పాలసీ కింద "బంగారు కుటుంబాల దత్తత", మార్గదర్శుల ఎంపిక, మరియు లబ్ధిదారుల నమోదు వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగా ల్లో వెనుకబడినవారికి చేయూతనిస్తూ, వారి జీవితాలను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు గంగ లక్ష్మమ్మ, లేపాక్షి తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపిడిఓ నరసింహామూర్తి, కార్యదర్శి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనకు ప్రజలు పూర్తి స్థాయిలో మద్దతు : ఎమ్మెల్యే కాలవ



కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలవ

**రాయదుర్గం జూలై 26,ప్రభాతవార్త**

ఐదేళ్ల వైకాపా రాక్షస పాలనలో ఎన్నో చేదు అనుభవాలతో విసిగివేసారిన ప్రజానీకం చంద్రబాబు నాయకత్వంలో కూటమి పాలనపట్ల సంతృప్తి వ్యక్తపరుస్తున్నారనీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత నిస్తున్న కూటమి ప్రభుత్వానికి జై కొడుతున్నారనీ రాయదుర్గం పట్టణ పర్యటనలో పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శనివారం ఆయన 20, 21వ వార్డుల్లో నిర్వహించారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రతి పేదోడి ఇంటికి ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా ఆర్థిక చేయూత అందుతొందన్నారు. గత ఎన్నికల్లో తనకు అఖండ మెజారిటీతో సత్తా చాటిన రాయదుర్గం ప్రజలు అదే సంపూర్ణ మద్దతును కూటమి ప్రభుత్వానికి అందిస్తున్నారన్నారు. వాడవాడలా, గ్రామాగ్రామానా వెంట నడుస్తూ తమ సంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వెల్లువిరుస్తోన్న ప్రజా ఉత్సాహమే అందుకు నిలువెత్తు సాక్ష్యమని ఆనందం వ్యక్తపరిచారు. చంద్రబాబు పాలనతోటే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడిందన్నారు. ఎన్ని ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని అమల్లో పెడుతున్నారని గుర్తు చేశారు. ప్రజలు భవిష్యత్తులో ఇదే విధమైన ఆదరాభిమానాలు అందిస్తూ కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పైతోట రామంజి,అంజి, సీనా,మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, బండి చిన్న,డాక్టర్ ఛన్నవీరా,పూజారి శివ తదితరులు పాల్గొన్నారు.

# అన్నప్రాసన చేయడం అదృష్టంగా భావిస్తున్నాను

- ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**గుంతకల్లు, జూలై 26 ప్రభాతవార్త**



చిన్నారికి విద్యాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

చిన్నారులకు అన్నప్రాసన చేయడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం పట్టణంలోని బలిజ కళ్యాణ మండపంలో అన్నప్రాసన, అక్షరాభ్యాస మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలు గర్భం దాల్చింది మొదలు పుట్టిన బిడ్డకు ఆరేళ్లు వచ్చేవరకు ప్రభుత్వం పౌష్టికాహారం అందించడంతో పాటు అంగన్‌వాడి కేంద్రాల ద్వారా విద్యను అందిస్తోందని పేర్కొన్నారు. అంగన్‌వాడి టీచర్లు, ఆయాలకు వేతనాలు కూడా పెంచడం జరిగిందని గుర్తు చేశారు. సక్రమంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అలాగే తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు ఇచ్చి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఆయన నియోజకవర్గంలోని అంగన్‌వాడి కేంద్రాలకు వంట పాత్రలు, ఇండక్షన్ స్టవ్, కుక్కర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, సిడిపిఓ భారతి, టిడిపి డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు, నాయకులు రామన్నచౌదరి, బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, రాయల్ వెంకటేష్, ఫజులు, గుజరి మహమ్మద్ ఖాజా, మస్తాన్, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**10,12 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు**

పట్టణంలోని 10,12 వార్డుల్లో శనివారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సామాజిక పింఛన్లతో పాటు, ఇతర సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# దేశాన్ని పాలించే పూర్తి అర్హతలు రాహుల్ గాంధీకి వున్నాయి

**మడకశిర టౌన్ జూలై 26 ప్రభాతవార్త.**



రఘువీరారెడ్డి

దేశాన్ని పాలించే పూర్తిగా అర్హతలు రాహుల్ గాంధీకి ఉందని మాజీ మంత్రి రఘువీరారెడ్డి అన్నారు. శనివారం మడకశిర మండల పరిధిలోని నీలకంఠపురం తన స్వగ్రామంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లాడుతూ నిన్నటి రోజు ఓబీసీ సదస్సులో రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలు అద్భుతం అని అన్నారు.ఈ దేశంలో ఉన్నటువంటి బడుగు బలహీన వర్గాల వారికి సమాన అవకాశం రావాలి అని అన్నారు.గత 70 సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రిజర్వేషన్ తో సహా అన్ని హక్కులు పేదవారి కీ ఇచ్చేటువంటి చట్టాలు తీసుకువచ్చరన్నారు.ఈ దేశంలో ఉన్న అన్ని అగ్రవర్గాల్లో ఉన్నటువంటి పేదలు కావచ్చు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మైనార్టీలు ఆర్థికంగా సాంఘికంగా రాజకీయంగా అన్ని హంగులతో ఏ విధంగా అందించాలి అనే తపన రాహుల్ గాంధీ ఉందన్నారు. పట్టు వదలని విక్రమార్కుడిలా జన కుల గణన జరగాలి రాహుల్ గాంధీ అన్నారన్నారు.. ఆలస్యమైన కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది అందువల్ల తెలంగాణలో అద్భుతమైన ప్రశ్నావళితో డేటా తీయడం జరిగిందన్నారు. దానికంటే మేలైన రీతిలో జన కుల గణన చేయాలని డిమాండ్ చేస్తున్నమన్నారు.రాహుల్ గాంధీకి అన్ని విషయాలపై సంపూర్ణమైన అవగాహన ఉంది 140 కోట్ల మందికి సమ్మతి కలిగిన నాయకత్వం ఉంది అనే విషయంలో సందేశం లేదన్నారు.ఈ దేశాన్ని పాలించడానికి పూర్తి అర్హత రాహుల్ గాంధీకే ఉందని అన్నారు.

# శ్రీ పాలపాటి దిన్నె బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన అర్చకులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

**నల్లచెరువు జూలై ప్రభాత వార్త: 26.**

మండల పరిధిలోని ప్రసిద్ధ గాంచిన పాలపాటి దిన్ని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఆలయ ఈవో మురళీకృష్ణ. అర్చకులు. పూర్ణ కుంభాలు మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తో పాటు కదిరి నియోజకవర్గ యువ నాయకులు వాల్మీకి పవన్ కుమార్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు అనంతరం ఎమ్మెల్యేకు దృశ్యాలులతో ఘనంగా సన్మానించారు. స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రావణమాస మహోత్సవాలలో భాగంగా ఆలయ పరిసరాలను ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించి భక్తాదులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పలు కార్యక్రమాల్లో పర్యవేక్షణ నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని పలువురికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన కదిరి నియోజకవర్గంలోని ఎక్కడ లేని విధంగా ఎంతో ప్రసిద్ధిచెందిన శ్రీ పాలపాటి దీన్ని ఆంజనేయస్వామి ప్రత్యేక పూజల్లో శ్రావణమాసంలో పాల్గొనడం ఆనందదాయకంగా ఉందని. ప్రమాణాలకు ప్రతీకగా ఎంతో నమ్మకంగా ప్రసిద్ధి చెందిన శ్రీ పాలపాటి దిన్ని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని. వివిధ ప్రాంతాల నుండి భక్తాదులు విచ్చేసి ముక్కు బడులు చెల్లించి స్వామి వారి దర్శనం భాగ్యం పొందుతున్నారని. స్వామివారి ఆశీస్సులతో కాలం బాగా కలిసి వచ్చి సకాలంలో వర్షాలు కురిసి రైతన్నలు పాడి పశువులతో. సుఖ సంతోషాలతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించామన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు తల్లమర్లవాండ్లపల్లి సర్పంచ్ జొన్న హర్షవర్ధన్ నాయుడు. మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ అశ్వర్థ నాయుడు. మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎద్దుల అంజనప్ప. కిరణ్ నాయుడు. సతీష్ చౌదరి.నాగిరెడ్డి.మాజీ వైస్ ఎంపీపీ బోలే మోహన. దేవేంద్ర గౌడ్. దేవలంవేణు. డివి నాగార్జున.కొలేపల్లి మాజీ సర్పంచ్ ఒరాతిచంద్ర.ఆంజనేయులు. గోవిందు.వేణు.కావిడి ప్రవీణ్. భరత్. లతోపాటు పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.

# ఇష్టారాజ్యంగా విధులకు హాజరు...!

- గతంలో నోటీసులు జారీ చేసినా మారని తీరు - ఇది సోషల్ వెల్ఫేర్ జిల్లా కార్యాలయంలోని ఉద్యోగుల పరిస్థితి
- వార్త పరిశీలనలో వెలుగులోకి - గతంలో డీడీ ఉద్యోగులకు మెమో, సర్కులర్ జారీ చేసినా మారని తీరు





శనివారం ఉదయం 10.50 గంటలకు ఖాళీగా ఉన్న కుర్చీలు

**అనంతపురం న్యూటౌన్, జూలై 26 ప్రభాతవార్త**

ప్రభుత్వ కార్యాలయాల పనివేళలను ఉద్యోగులు ఖచ్చితంగా పాటించాలని నిబంధన వుంది. కానీ పలువురు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా విధులకుగా హాజరవుతున్నారు. అంతే కాకుండా టీ, కాఫీ తాగడానికి రెండు, మూడు సార్లు వెళ్లి వస్తూ సమయాన్ని వృధా చేస్తున్నారు. మూమెంట్ రిజిస్టర్‌లో కారణం రాయకుండా భయటకు వెళ్లిపోతున్నారు. ఆయా కార్యాలయాల ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణం.

అనంతపురం జిల్లా సోషల్ వెల్ఫేర్ జిల్లా కార్యాలయాన్ని శనివారం ఉదయం 10:50 గంటలకు వార్త విలేఖరి పరిశీలించగా...అక్కడ పలువురు ఉద్యోగులు లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ప్రభుత్వ కార్యాలయాల పనివేళలు ఉదయం 10:30 గంటల నుండి సాయయంత్రం 5 గంటల వరకు. మధ్యాహ్నాం 1 గంటల నుండి 30 నిముషాలు మాత్రమే భోజన విరామం. కానీ ఆర్‌టిఐ విభాగం పలువురు ఉద్యోగులు ఉదయం 10:50 గంటలు అయినా విధులకు హాజరుకాలేదు. ఆ ఉద్యోగులు ఆ తర్వాత విధులకు హాజరైయ్యారు. అంతే కాకుండా పురుష ఉద్యోగులు టీ, కాఫీలు తాగడానికి భయటకు వెళ్లి రావడానికి దాదాపు 15-20 నిముషాల సమయాన్ని వృధా చేస్తున్నారు. అలా ఒక రోజుకు రెండు, మూడు సార్లు వెళ్లి వస్తున్నారు. అంతే కాకుండా మరి కొందరు ఉద్యోగులు సొంత పనులకు పనివేళలలో భయటకు వెళ్లిపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పనివేళల్లో ఉద్యోగులు భయటకు వెళ్లాలంటే మూమెంట్ రిజిస్టర్‌లో ఖచ్చితంగా కారణం వ్రాసి పైఅధికారి అనుమతితో వెళ్లాలని ప్రభుత్వ నిబంధన వుంది. కానీ అక్కడ మూమెంట్ రిజిస్టర్ ఉంటుంది. కానీ చాలా మంది ఉద్యోగులు మూమెంట్ రిజిస్ట్రర్‌లో కారణాలు రాయడానికి ఇష్టపడటం లేదు. అంతే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పేషీయల్ అటెండెన్స్ ఖచ్చితంగా వేయాలనే నిబంధన వుంది. కానీ ఎఫ్ఆర్ఎస్ వేస్తే అందులో ఆలస్యం వచ్చిన సమయం భయట పడుతుందనే ఉద్దేశ్యంతో ఉద్యోగులు ఎఫ్ఆర్ఎస్ వేయకుండా అటెండెన్స్ లోనే సంతకాలు చేస్తుండటం గమనార్హం. ఆ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రతి రోజు కార్యాలయానికి ఎన్ని గంటలకు వస్తున్నారు, మధ్యాహ్న భోజనానికి ఎన్ని గంటలకు వెళ్లి తిరిగి ఎన్ని గంటలకు వస్తున్నారో అన్న విషయాలు కోసం ఆ కార్యాలయంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తే వాస్తవాలు తెలిసిపోతాయి. అయితే దీనిపైన జిల్లా ఉన్నతాధికారిణి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది తెలియాల్సి వుంది.

**గత నవంబర్‌లో మెమో, సర్కులర్ జారీ :**

సోషల్ వెల్ఫేర్ జిల్లా కార్యాలయం ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తుండటంపై గత ఎడాది నవంబర్ 7న వార్తదినపత్రికలో కథనం ప్రచురితం అయ్యింది. అప్పుడు కూడా ప్రస్తుత బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి సోషల్ వెల్ఫేర్‌డీడీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పుడు స్పందించి విధులపట్ల నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగులకు అప్పుడే మెమోలు జారీ చేసింది. అందుకు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఉద్యోగులు ఖచ్చితంగా సమయ పాలన పాటించాలని కూడా సర్కులర్ జారీ చేశారు. కానీ అప్పుడు ఉద్యోగులతో వివరణ రాయించుకున్నారో, లేదో తెలియదు. కానీ ఉద్యోగులపై తదుపరి చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత కొత్త డీడీ రావడంతో ఆ ఫైల్ పెండింగ్‌లోనే ఉండిపోయింది.

**విచారించి చర్యలు తీసుకుంటాం**
**- సోషల్ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి**

సోషల్ వెల్ఫేర్ జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులలో కొందరు శనివారం ఉదయం 10:50 గంటలు అయినా రాలేదన్న విషయం తన దృష్టికి వచ్చింది. దీనిపై విచారించి ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

# నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరూ కష్టపడి పని చేద్దాం...!

- ధర్మవరంలో పీ4 పై కీలక సమావేశంలో అధికారులకు పరిటాల సునీత పిలుపు...!

**ధర్మవరం,జూలై 27(ప్రభాతవార్త)**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఓ వైపు పేదరిక నిర్మూలన చేస్తూ.. ఇంకోవైపు నియోజకవర్గ అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పని చేద్దామని అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో శనివారం పీ4, రాప్తాడు నియోజకవర్గం స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047పై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రామమోహన్, ఆర్డీఓ మహేష్ తో పాటు నియోజకవర్గ ఎంపీడీఓలు, ఎమ్ఆర్ఓలు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. ఇందులో అత్యంత ప్రధాన్యతగా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని పేరూరు రిజర్వాయర్ వరకు 54 కి.మీ.ల సాగునీటి కాలువ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం ముఖ్యమైందన్నారు. గత ప్రభుత్వంలో ఇది పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి మండలాల పరిధిలో 1011.08 ఎకరాల భూమిని సేకరించగా ఇందులో కేవలం 95.16 ఎకరాలకు 5.20 కోట్ల రూపాయలు రైతులకు అందిందని.. మిగిలిన 915.92 ఎకరాలకు నేటి ధరల ప్రకారం చెల్లించాల్సి ఉందన్నారు. చెన్నేకొత్తపల్లి, పులేటిపల్లి, నాగసముద్రం గ్రామా లమధ్యలో రైతులకు చెందిన, ఎలాంటి పంటలు సాగు చేయని సుమారు 4 వేల ఎకరాల బీడు భూములున్నాయని.. ఈ భూముల్లో హార్టీకల్చర్ హబ్ లేక సోలార్ హబ్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం కనగానపల్లి మండలంలో సోలార్ మరియు పవన విద్యుత్ పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కనగానపల్లి మండలం, దాదులూరు గ్రామం, జాతీయ రహదారి సమీపంలో సుమారు వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని.. వాటిలో పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోరుచిక్కుడు పరిశ్రమకోసం నిర్మించిన నిర్మాణాలను ఉపయోగంలోకి తేవాలని, రామగిరి బంగారు గనులను తెరిపించి స్థానికులకు ఉపాధి కల్పించడం, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలలో నెలకొన్న తీవ్ర త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం ఒక ప్రత్యేక త్రాగునీటి పథకాన్ని మంజూరు చేయాల్సి ఉందన్నారు. రాప్తాడు ఆటో నగర్ నందు మోలిక సదుపాయాలు కల్పించాలని, పండమేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని, నడిమివంక రక్షణ గోడ నిర్మించేలా, రైతులకు, చేతి వృత్తుల వారికి ఉపయోగపడేలా పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలను వివరించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన పీ4 కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. నియోజకవర్గ పరిధిలో పేద కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇలాంటి కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులను గుర్తించాల్సి ఉందన్నారు. నియోజకవర్గానికి చెందిన చాలా మంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని అలాంటి వారికి కార్యక్రమాన్ని వివరించి.. పేద కుటుంబాల ఉన్నతి కోసం పని చేయాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

# ఓల్డ్ టౌన్ మార్కెట్‌ను అందరికీ ఆదర్శంగా అందుబాటులోకి తెస్తాం

- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం కలెక్టరేట్ జూలై 26 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలోని ఓల్డ్ టౌన్ మార్కెట్ ను అందరికీ అందుబాటులో ఆదర్శంగా ఏర్పాటు చేస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో మార్కెట్ విషయంలో మాట ఇచ్చి తప్పారని ఇప్పుడు ఆ మార్కెట్ ను ఆధునికరించే బాధ్యతలను తీసుకున్నట్లు చెప్పారు. ఆయన ఇవాళ నగరంలోని 12వ డివిజన్ లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అబ్జర్వర్లు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా ప్రజలు మాకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని ఇప్పటికే మెగా డీఎస్సీ, అన్నా క్యాంటీన్ లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చారన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని పాఠశాలల ప్రారంభం రోజే తల్లికి వందనం పథకాన్ని ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ జనబలం బాబా, 12 వ డివిజన్ నాయకులు మాజీ కార్పొరేటర్ రంగాచారి, కరిముల్లా, బాలా, మల్లి, ప్రభాకర్, మోల, నాగరాజు, టిడిపి సీనియర్ నాయకులు గద్దం సుబ్రహ్మణ్యం, సింగవరం రవి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం నాగభూషణ, టిఎన్టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మోహన్ కుమార్, కార్పొరేటర్ బాలాంజినేయులు, మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి, సరళ, పావురాల శేఖర్, డీలర్ల సంఘం అధ్యక్షుడు గోళ్ళ సుధాకర్ నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంజనీపుత్ర వీరాంజనేయ నమోన్నమః

డి.హిరెహాళ్ జూలై 26 ప్రభాతవార్త



అంజనీపుత్ర వీరాంజనేయ నమోన్నమః అంటూ భక్తుల వెంట ఆంజనేయ నామస్మరణం మారుమోగింది. శనివారం డి.హిరెహాళ్ మండలం మురడి గ్రామంలో మొదటి శ్రావణ శనివారం ను పురస్కరించుకొని భక్తులు మూలవిరాట్ ఆంజనేయస్వామి దర్శనార్థమై తరలివచ్చి స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ శనివారం మొదటి రోజున ఆలయ అర్చకులు రామాంజనేయులు, పవన్ కుమార్ ల ఆధ్వర్యంలో



ఆంజనేయస్వామి దర్శనార్థమై తరలివచ్చిన భక్తులు

మూలవిరాట్ ఆంజ నేయస్వామి విగ్ర హమును వేకువ జామునే శుభ్రపరచి ప్రత్యేకంగా అలంక రించారు. అర్చకు లు ముందుగా స్వామివారి కి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించి ఆకు పూజ, పుష్పాలంకరణ అనంతరం జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు. ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడిఅనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలతోపాటు మండలంకు సరిహద్దున ఉన్న పురుగు రాష్ట్రమైన కర్ణాటకలోని బళ్లారి, చిత్రదుర్గ, కొప్పళ తదితర జిల్లాల నుండి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు భక్తులు స్వామివారికి ప్రత్యేకపూజలు చేయించి మొక్కుబడులు తీర్చుకొని స్వామివారి సేవలోతరించారు. దర్శనార్థమైవచ్చిన భక్తులకు ఆలయ ఈవో నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌గంగప్ప, ఎంపీటీసీ గంగాధర, స్వామివారి భక్తమండలి సభ్యులు సౌకర్యాలుకల్పించారు. భక్తులకు ఎలాంటిఅసౌకర్యాలు కలగకుం డా, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## ఘనంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకిసేవ

రాయదుర్గం జులై 26 ప్రభాతవార్త



స్వామివారి మూలవితాట్

రాయదుర్గం మండలం మల్లాపురం గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామికి శనివారం పల్లకిసేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఆలయ కమిటి గౌరవాధ్యక్షులు రామామూర్తి స్వామి ఆధ్వర్యం లో శ్రీ స్వామి వారికి ఉదయం సుప్రభాతసేవ పంచామృభిషేకం పుష్పఅలం కరణ నైవేద్యం పూజలు నిర్వహ్నిచారు అనంతరం స్వామీవారి ఉత్సవ విగ్రహలను పల్లకిలోఅధిష్టించి ఊరెగించాసారు అనంత రం మహమంగళ హారతి తీర్థ ప్రసాదం గావించారు ఈ సందర్భంగా భక్తులకు బళ్లారి నివాసులు పసుపులేటి సూర్యప్రకాష్ భార్య వై రాధ. కుమారుడు అన్నదానం చేశారుఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు బిఎన్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారి సత్యనారాయణ, నరసింహులు, కార్యదర్శి గురు, అకౌంట్టే వెంకటేశులు సభ్యులు కమలాక్షుడు, గురునాథ్ రెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి ఆనందరెడ్డి చౌదప్ప, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల ఇంటి వద్దకే అవేర్నెస్ కార్యక్రమం

కళ్యాణ్ దుర్గం టౌన్ జూలై 26 ప్రభాతవార్త

కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా కళ్యాణదుర్గంకు విచ్చేసి మాజీ సైనికులకు వృద్ధులకు వితంతువులకు అవేర్నెస్ కల్పించి ఇంటి వద్దకే సేవలు అందించడానికి అనంతపురం జిల్లా సైనిక్ బోర్డు కార్యాలయం వారు సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ టి తిమ్మప్ప, అధ్యక్షతన కళ్యాణదుర్గం పట్టణంలోని పార్వతి నగర్ లో శనివారం రోజున పట్టణంలోని మాజీ సైనికుల అసోసియేషన్ కార్యాలయంలో మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులు దత్తయ్య, జాయింట్ సెక్రెటరీ ప్రాంగణ స్వామి, కమిటీ సభ్యులు శ్రీనివాస మూర్తి, జి రామాంజనరెడ్డి, ఉమాపతి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మాజీ సైనికుల మరియు వృద్ధులు వితంతువులు వారి సమస్యలను ఇల్లు వద్ద కే విచ్చేసి మాజీ సైనికులకు అవేర్నెస్ ఇచ్చిన అనంతపురం జిల్లా సైనిక్ బోర్డ్ అధికారులు. మాజీ సైనికుల పెన్షన్ సంబంధిత స్పార్స్, గుర్తింపుకార్డు, డిపెండెంట్ కార్డు, మరియు హౌస్ టాక్స్ ఎక్సంప్షన్, ఎలా పొందాలి అనే విషయాల గురించి చక్కగా వివరించారు. పి పి ఓ, లో ఏవైనా కరెక్షన్ పేరు పుట్టిన తేదీ ఆధార్ మొదలైనవి ఇలా మార్చుకోవాలని వివరించడం జరిగినది. తదుపరి వృద్ధాప్యాలకు ఐడెంటి కార్డు, డిపెండెంట్ కార్డ్, జిల్లా సైనిక్ బోర్డ్ ఆఫీసర్ టీ తిమ్మప్ప చేతుల మీదుగా అందించడం జరిగినది. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులను శాలువా పూలమాలతో సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ బోర్డ్ గిరీష్, అనిల్ కుమార్, ఫక్రుద్దీన్, కళ్యాణదుర్గం నియోజకవర్గం మాజీ సైనికులు సైనిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నింబగల్లులో 'అంగన్‌వాడీ పిలుస్తోంది'

### -హాజరైన సూపర్‌వైజర్ శ్రీదేవి



నింబగల్లులో జరిగిన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం దృశ్యం

ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త

మండల పరిధిలోని నింబగల్లు గ్రామంలో శనివారం 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ మూడేళ్ల వయసు నిండిన పిల్లలను చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో, అయిదేళ్లు పూర్తి చేసుకున్న పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంను నిర్వహించడం జరుగుతోందన్నారు. బడి బయట పిల్లలెవరూ ఉండకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరితే అటు ఆరోగ్యం, ఇటు చదువు కూడా ఉంటుందని తల్లులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు వారి వయసుకు తగ్గట్టు ఆటపాటలతో బోధన ఉంటుందని ప్రతిరోజూ పాలు, ఉడికించిన కోడిగుడ్డు, మధ్యాన్న భోజనం అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ అపర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు రామాంజనమ్మ, ఈశ్వరిదేవి, శ్రీదేవి, సహాయకులు, పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టేకులోడులో భూసేకరణ వేగవంతం

చిలమత్తూరు, జూలై 26 ప్రభాతవార్త



భూసేకరణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

టేకులోడు గ్రామంలో శనివారం భూసేకరణ ప్రక్రియలో అధికారులు భూసేకరణ వేగవంతం చేశారు. ఈ మేరకు పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహశీల్దార్ నటరాజ్, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావు గ్రామానికి వచ్చి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసైన్డ్ భూములకు ఎకరాకు 12.66



నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్న టేకులోడు గ్రామస్తులు

లక్షల రూపాయల నష్టపరిహారాన్ని ప్రకటించారు. ఈ పరిణామంతో గ్రామంలోని 60 శాతం మంది రైతులు సానుకూలంగా స్పందించినప్పటికీ, మిగిలిన రైతులు మాత్రం ఈ ధర తక్కువగా వుందని అభిప్రాయపడ్డారు. భూముల విలువ మరింత ఎక్కువగా వుండేలా నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నేలకోటప్ప, టేకులోడు విఆర్ఓ అశ్వత్థప్ప, వెంకటసాయి, తదితరులు పాల్గొన్నారు.

**తాగునీటి సమస్య పరిష్కరించండి :** టేకులోడు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని శనివారం భూసేకరణ సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావుకు గ్రామస్తులు విన్నవించారు. ఒక సంవత్సరం నుండి నీటి కోసం అల్లాడుతున్నామని, పలుమార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదని, కొందరు మాత్రమే నీటిని వినియోగిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన శ్రీనివాసరావు తానే ఖర్చు భరిస్తానని వెంటనే బోర్ వేసే ఏర్పాట్లను చేపట్టాలని అధికారులకు సూచించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## నీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

చిలమత్తూరు. జూలై 26 ప్రభాతవార్త



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

మండలంలోని తుమ్మల కుంట గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని శనివారం గ్రామస్తులు, సిపిఎం నాయకులు సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో వున్న కొద్దిపాటి బోర్లలోనీరు వున్నా కొందరు మోటర్ల ద్వారా నీటిని సంపుల్లో నింపుకుంటుండటంతో మిగతా ప్రజలకు తాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మహిళలు, వృద్ధులు దూర ప్రాంతాలకు నడుచుకుంటూ వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారన్నారు. దీంతో సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో గ్రామస్తులు సచివాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యదర్శి లేకపోవడంతో బిల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందచేసి సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, సుధాకర్, తుమ్మలకుంట గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రోజులు వైకాపావే

### -హిందూపురం వైకాపా ఇన్‌చార్జ్ దీపిక



కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

లేపాక్షి, జూలై 26 ప్రభాతవార్త

రాబోయే రోజులు వైకాపావేనని హిందూపురం నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జ్ దీపిక పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొండూరు, కల్లూరు, మానేపల్లి గ్రామాల్లో వైకాపా మండల కన్వీనర్ నిసార్‌అహ్మద్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లోనూ దీపిక వేణు పలు ఇళ్లకు వెళ్లి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదని వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు అమలు చేసిన పథకాలను వివరించారు. అనంతరం దీపిక వేణు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అభివృద్ధిని మరచి కక్ష సాధింపు చర్యలను చేపట్టిందన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వ విధానాలను పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలే చంద్రబాబుకు బుద్ధి చెబుతారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గంలో స్వచ్ఛ ఆంధ్ర పి 4 కార్యక్రమం

కళ్యాణదుర్గం టౌన్, జూలై 26, ప్రభాతవార్త



సచివాలయం వద్ద కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పట్టణంలోని కుమ్మర వీధి సచివాలయం పరిధిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, పి పోర్ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ శానిటేషన్ అలీ ఖాన్, వార్డ్ అధ్యక్షులు టిడిపి నాయకులు నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పేదరికంలో ఉన్న కుటుంబాలు, చేతివృత్తులు చేసుకునే ప్రతిభావంతులను గుర్తించి వారి బంగారు భవిష్యత్తుకు జీవనోపాధి కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వార్డులోని మహిళలు, టిడిపి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు సింగిల్ విండో అధ్యక్షుడు, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం

గుడిబండ జూలై 26 ప్రభాతవార్త



మద్దనకుంటప్ప

మండల కేంద్రంలోని మండలపల్లి సింగల్ విండో అధ్యక్షులు డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సింగల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, డైరెక్టర్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే సింగిల్ విండో అధ్యక్షుడు, డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎంఎల్ఏ ఎంఎస్ రాజు, ఎంపీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, డిసిసి బ్యాంక్ చైర్మన్ కేశవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని కావున మండల వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నేడు ఎంఈఎఫ్ జిల్లా మహా సభలు



మాట్లాడుతున్న ఎంఈఎఫ్ నాయకులు

బెలుగుప్ప, జులై 26 ప్రభాతవార్త

నేడు (ఆదివారం) బెళుగుప్ప ఎంఈఓ కార్యాలయం ఆవరణలో కళ్యాణదుర్గంలో జరిగే ఎంఈఎఫ్ జిల్లా మహాసభ కరపత్రాలను మండల విద్యాధికారి హరికృష్ణ, బెళుగుప్ప ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లెల వెంకట ప్రసాద్ చేతుల మీదుగా జిల్లా ఉపాధ్యక్షులు టి లక్ష్మణ్ అధ్వర్యంలో శనివారం విడుదల చేశారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు భిక్షాలు, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, జిల్లా అధ్యక్షు లు మన్నెపాకుల రమేష్ హాజరు అవుతున్నారన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల ప్రకారం జాతీయ, రాష్ట్ర, జిల్లా, తాలూకా, మండల కమిటీలు ఏర్పాటు వాటి బలోపేతం, మాదిగ ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు తదితర అంశాలపై చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.లక్ష్మీపతి, ఉపాధ్యాయులు శంకర్, ప్రేమ్(మారెన్న), రామస్వామి, సిఆర్ఎంటి పీటర్ ఎంఐఎస్ చిరంజీవి, రాముడు, వంశీ పాల్గొన్నారు.

## మహిళ సాధికారతే ఆర్డిటీ సంస్థ లక్ష్యం

### ఆర్డిటి మహిళా బ్యాంక్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విశాల ఫెర్రర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డిటి మహిళా డైరెక్టర్ విశాలా ఫెర్రర్

కంబదూరు, జూలై 26, ప్రభాతవార్త

మహిళా సాధికారతే ఆర్డిటి సంస్థ లక్ష్యమని ఆర్డిటి మహిళా డైరెక్టర్ విశాలా ఫెర్రర్ పేర్కొన్నారు. కంబదూరు మండల కేంద్రంలో శనివారం



కార్యక్రమానికి హాజరైన మహిళా లబ్ధిదారుల దృశ్యం

నిర్వహించిన ఆర్డిటి మహిళ బ్యాంక్ ప్రథమ వార్షికోత్సవ మహాసభకు విశాల ఫెర్రర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్డిటి ఆధ్వర్యంలో కో ఆపరేటివ్ బ్యాంక్ ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి కావడంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిటి సంస్థ మహిళా డైరెక్టర్ విశాల ఫెర్రర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కల అని తెలియజేశారు. ఫాదర్ ఆశయాలను నెరవేర్చేందుకే మహిళలకు కోఆపరేటివ్ బ్యాంకులు ఏర్పాటుచేసి రుణాలు అందించడంతో పాటు వారు స్వయంకృషితో జీవించేందుకు ఆర్డిటి తోడ్పాటు అందిస్తుందని చెప్పారు. మహిళలు అని రంగాల్లో రాణించేందుకు ఆర్డిటి సంస్థ ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలియజేశారు. కంబదూరు ప్రాంతంలో ఎంతోమంది మహిళలకు రుణాలు అందించామని అన్నాను. అయితే రుణాలు తిరిగి చెల్లించడంలో కంబదూరు మొదటి స్థానంలో ఉండటం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి సిబ్బంది ,మహిళా సంఘాలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకులు

కనేకల్లు జూలై 26 ప్రభాతవార్త

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేని ప్రభుత్వాన్ని గద్దె దింపాలని.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి అన్నారు. కనేకల్ మండల పరిధిలోని సొల్లాపురం గ్రామము నందు.బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం కనేకల్ మండల్ వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.. కణేకల్ మండల పరిధిలోని సొల్లాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం లో వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించిన , వైసీపీ నేతలు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతాంగానికి జరుగుతున్న మోసాలను తెలియజేశారు. వైసీపీ నేతలు, మహిళలకు ఉచిత బస్సు. మహిళలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత ప్రతి నెల 15 వందల రూపాయలు ఇవ్వలేదు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వాళ్లకు 50 సంవత్సరాలు నిండిన వారికి ప్రతినెల నాలుగు వేల రూపాయలు పింఛన్ ఇవ్వలేదు అన్నారు చంద్రబాబు వచ్చాక తమకు రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందలేదన్న రైతులు, జగన్ హయాంలో ఏటా రూ.13,వేల 5 వందలు రైతు భరోసా అందించినట్లు తెలియజేసిన నాయకులు.. కూటమి వచ్చాక ఒక్క రూపాయి కూడా అన్నదాతలకు ఇవ్వలేదని వండిపడ్డారు రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం, రైతుల తరఫున వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పోరాటాలను వివరించిన వైసిపి నాయకులు, రైతులకు వైసీపీ అండగా ఉంటుందని హామీ, సూపర్‌సిక్స్ హామీలు మాటల్లోనే గానీ చేతల్లో అమలు కాలేదన్న స్థానికులు, చంద్రబాబును నమ్మి మరోసారి మోసపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రజలు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వాటిల్ బ్రహ్మానందరెడ్డి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కన్నారి ఉషారాణి బీసీ సెల్ నాయకులు రచు మరి హళ్లి నాగరాజు ఆది సద్గురు ఫర్టిలైజర్స్ చంద్రశేఖర్ ఊడే గోళం వేమన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

గుడిబండ జూలై 26 ప్రభాతవార్త



మండలంలోని కొంకల్లు, కురుబరపల్లి, హిరేతుర్పి తిమ్మలాపురం, బిటిపల్లి, శంకరగల్లు, తదితర గ్రామాల లో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో కొంకల్లు గ్రామ పొలిమేరలో వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామి వారికి వివిధ రకాల పూలతో అలంకరించి నెయ్యి అభిషేకం, పాలభిషేకం తోపాటు ఆకు పూజ నిర్వహించారు.ఈ క్రమంలో కర్ణాటక రాష్ట్రంలోని పావగడ, శిర, మదగిరి, బెంగళూరు, కొరటేగెర, హిరియూర్, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారి సన్నిధిలో అన్నదానం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా కర్ణాటకవాసులు మాట్లాడుతూ శ్రావణమాసం కావడంతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు.

## పెన్నహోబిళంలో వైభవంగా లక్ష్మినరసింహుని ప్రాకారోత్సవం

ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త



లక్ష్మీనరసింహస్వామి ప్రాకారోత్సవం

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం శ్రావణ శుద్ధ విదియ శనివారం సాయంత్రం లక్ష్మీనరసింహుని ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చగా ప్రధానాలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి జిల్లా ఎస్పీనీ కలిసిన ఏపీజేఎస్ఎనాయకులు.





సత్యసాయి జిల్లా ఎస్పీ కి క్రీడా మెమెంటును అందజేస్తున్న ఏ.పి జె.ఎస్.ఏనాయకులు

కొత్తచెరువు జూలై 27: ప్రభాతవార్త.

సత్యసాయిజిల్లా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ నాయకులు జిల్లా ఎస్పీ విరత్నను మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం జిల్లా కేంద్రం లోని సాయి ఆరామం లో కలిసి క్రీడ పోటీలు నిర్వహణకు గుర్తుగా మొమెంటు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఓబుళంపల్లి రామకృష్ణ, పుటపర్తి నియోజకవర్గం అధ్యక్షులు చాపిరెడ్డి హరీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి . కేశవయ్య గౌరవ అధ్యక్షులు సివిఆర్ సూరి,, ధర్మవరం నియోజకవర్గం నాయకులు మేడాపురం కేశవ, కనుముక్కల చిరంజీవి ,అనంతశిఖరి మురళి కృష్ణ, ఉపాధ్యక్షులు షేక్షావలి ప్రచార కార్యదర్శి నూర్ భాషా కోశాధికారిఎన్ ఎన్ నరసింహులు కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు గూడా శ్రీనివాసులు గంగాధర్ అంజి షేక్ గౌస్ బాషా, నాగరాజు, మహేష్, అంజి, గూడ శ్రీనివాసులు, షేక్ భాషా, మహేష్,, తదితరులు కలిసిన వారి లో ఉన్నారు. ఈ సందర్బంగా అన్ని శాఖల ఉద్యోగులతో కలుపుకొని ఆటవిడుపుగా ఈ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం జరుగుతుందని, అంతేకాకుండా అన్ని శాఖల ఉద్యోగులు వృత్తిరీత్యా బిజీబిజీగా గడపడమే కాకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అందుకోసం క్రీడ పోటీలు నిర్వహించడం మా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ముఖ్య ఉద్దేశ్యంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో పోలీస్ అధికారులు కూడా భాగస్వాములు కావాలని ఈ సందర్బంగా ఎస్పీ వి. రత్న ని వారు కోరారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించి పోలీస్ శాఖ నుంచి ఖచ్చితంగ క్రీడల్లో పాల్గొంటామని హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు నుండి టన్నుకు పైగా అల్యూమినియం స్క్రాప్ బస్తాలు సీజ్

### ఉరవకొండలో కమర్షియల్ టాక్స్ అధికారుల దాడులు



హైదరాబాద్ ఆర్టీసీ బస్సు నుండి స్వాధీనం చేసుకున్న అల్యూమినియం స్క్రాప్ బస్తాలు

ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం నుండి హైదరాబాద్ కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నుండి కమర్షియల్ టాక్స్ అధికారులు శనివారం రాత్రి 20 బస్తాల్లో ఉన్న అల్యూమినియం స్క్రాప్ ను స్వాధీనం చేసుకున్నారు. ఖచ్చితమైన సమాచారంతో కళ్యాణదుర్గం డిప్యూటీ కమర్షియల్ టాక్స్ అధికారి సురేష్ సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్సును వెంబడించి బస్సు ఉరవకొండకు రాగానే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సు లగేజ్ బాక్స్ లో ఉన్న టన్నుకు పైగా బరువుగల అల్యూమినియం స్క్రాప్ బస్తాలను గుర్తించి పంచనామా అనంతరం జిల్లా కేంద్రానికి తరలించారు. అనుమతులు లేకుండా కార్గో పార్సిల్ సర్వీస్ ద్వారా అల్యూమినియం బస్తాలను తరలిస్తున్నట్లు తెలియవచ్చింది. కాగా అధికారులు బస్తాల్లో ఉన్నది అల్యూమినియం స్క్రాప్ అని చెబుతుండగా అందులో ఉన్నది వాస్తవానికి అల్యూమినియం స్క్రాపా లేకపోతే ఇతర విలువైన వస్తువులు ఉన్నాయా అన్నది తెలియడం లేదు. ఈ దాడుల్లో అల్యూమినియం స్క్రాప్ తరలిస్తున్న కళ్యాణదుర్గానికి చెందిన ఒక వ్యక్తిని కూడా కమర్షియల్ టాక్స్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. కళ్యాణదుర్గంలోని ఒక గుజిరి నుండి ఈ అల్యూమినియం స్క్రాప్ హైదరాబాద్ కు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై పూర్తి సమాచారాన్ని మీడియాకు వెల్లడించడానికి కమర్షియల్ టాక్స్ అధికారి సురేష్ ఇష్టపడలేదు.

## అక్రమ కట్టడాల తొలగింపులు ప్రారంభించిన అధికారులు

కొత్తచెరువు జూలై 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులలో భాగంగా పెనుగొండ రోడ్డు నుంచి బుక్కపట్నం రోడ్డు కి, ధర్మవరం రోడ్డు నుంచి కోడి కొండ చెక్ పోస్ట్ రోడ్డు వైపు కి ఉన్న అక్రమ కట్టడాలు తొలగిస్తూ పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ శనివారం అక్రమ తొలగింపు పనులు జెసిబి తో ప్రారంభించారు రెండు నెలలు క్రితం నుంచి రెవిన్యూ ఆర్ అండ్ బి అక్రమ కట్టడాలు తొలగించి అభివృద్ధికి దోహదప డాలని ఆక్రమణ దారులకు రెండు నెలల గడువు ఇస్తూ నోటీసులు జారీ చేసినప్పటికీ స్వచ్ఛందంగా కొన్ని అక్రమ కట్టడాలు మాత్రమే తొలగించుకోవడం జరిగింది మిగిలిన అక్రమ కట్టడాలు తొలగించుకోకపోవడం తో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు ఆర్డిఓ సువర్ణ ఇన్చార్జి తాసిల్దార్ బాలాంజనేయులు స్థానిక సీఐ జీఎం శంకర్ పంచాయతీ అధికారులు ముందుండి పెనుకొండ రోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందర ఉన్న అక్రమ కట్టడాలు తొలగించడం జరిగింది.



జెసిబి తో రేకులతో వేసుకున్న బంకులు తొలగిస్తున్న దృశ్యం

03ATP26_03ATP26.qxd 26-07-2025 PM 10:28 Page 1



## కెఎస్ఆర్ హైస్కూల్ హెచ్ఎం బాధ్యతలు స్వీకరణ


హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న పి.బాలకృష్ణ

వార్త ప్రభావం

**అనంతపురం న్యూటౌన్, జూలై 26 ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంలోని కెఎస్ఆర్ గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ హెచ్ఎంగా పసులూరు బాలకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. గతంలో హెచ్ఎంగా పని చేస్తున్న నారాయణ గత నెల పదవీ విరమణ పొందారు. అయితే మరొ కరికి హెచ్ఎం (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించకుండా జిల్లా విద్యాశాఖ నిర్లక్ష్యం చేస్తుండటంపై ఈనెల 24న విద్యాశాఖ నిర్లక్ష్యం...హెచ్ఎం లేక జీతాలకు ఇక్కట్లు...! అనే శీర్షికతో కథనం ప్రచురితం అయ్యింది. అందుకు డీఈవో ఎం. ప్రసాద్ బాబు స్పందించి రెండో సీనియర్ టీచర్ లలితేశ్వరికి హెచ్ఎం (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగిస్తూ ఈనెల 25న (శుక్రవారం) ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆమె కూడా హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించకపోవడంపై తిరిగి ఈనెల 26న కెఎస్ఆర్ హైస్కూల్ హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించని లలితేశ్వరి అనే శీర్షికతో కథనం ప్రచురితం అయ్యింది. అప్పటికే ఈ విషయాన్ని వార్త విలేఖరి జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మూడో సీనియర్ టీచర్ పసులూరు బాలకృష్ణకు హెచ్ఎం (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగిస్తూ ఏడీ మునీర్ బాష ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం నూతన హెచ్ఎం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు టీచర్లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

**24 ఇయర్స్ స్కేల్ వెనక్కి కట్టించేరా? :**

అంతే కాకుండా గత కొంత కాలంగా ప్రభుత్వం నుండి 24 ఇయర్స్ స్కేల్ (ఫైనాన్స్ బెనిఫిట్స్) తీసుకుంటున్న కెఎస్ఆర్ గర్ల్స్ గవర్నమెంట్ హైస్కూల్లోని ఇద్దరు సీనియర్ టీచర్లు కె.సి.పద్మజ, లలితేశ్వరిలు ఇప్పటికే రెండు సార్లు హెచ్ఎం బాధ్యతలు వద్దు అని రాసిచ్చారు. అలాంటప్పుడు ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా 24 ఇయర్స్ స్కేల్ (ఫైనాన్స్ బెనిఫిట్స్)ను వారు ఎప్పటి నుండి తీసుకుంటున్నారో అప్పటి నుండి తిరిగి ప్రభుత్వానికి వెనక్కి చెల్లించేలా జిల్లా విద్యాశాఖ అధికారులు గట్టి చర్యలు తీసుకుంటారా? లేదా? అన్నది తెలియాల్సి వుంది.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు పెంపుకు విస్తృత ప్రచారం


ప్రచార పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, జూలై 26 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓఎస్ఎస్) 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు పెంపుకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ ఆధ్వ ర్యంలో శనివారము అనంతపురం జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శైలజ, ఉమ్మడి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి.రామసుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లా అంబేద్కర్ గురుకులాల జిల్లా కన్వీనర్ జయలక్ష్మి, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి కార్యాలయాల్లో వారి సిబ్బందితో కలిసి ఓపెన్ స్కూల కు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కరపత్రాలు కూడా పంపిణీ చేశారు. ఈ విద్య సంవత్సరంలో ఓపన్ స్కూల్ పెంచడానికి ఆయా శాఖ జిల్లా అధికారులు, సిబ్బంది ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఏసీ కోరా రు. ఈ కార్యక్రమంలో క్లర్క్ శ్రీనివాసులు, ఆయా శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కేంద్రాలలో ఈసిసిఈ డే నిర్వహణ


అంగన్వాడీ కేంద్రంలో ఈ సి సి ఈ డే కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, జులై 26 ప్రభాతవార్త**

అనంతపురం రూరల్ మండలంకక్కలపల్లి కాలనీ పంచాయితి లో సుంద రయ్య కాలని అంగన్ వాడి కేంద్రం మరియు బిఎన్ఆర్ కాలని అంగన్వాడి కేంద్రంలో ఈసీసిఈ డే కార్య క్రమం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్ర మానికి సీడీపీఓ ఉమాశంకరమ్మ, సూపర్వైజర్లు భారతి, సుభాషిణి, సునంద, అంగన్వాడీ టీచర్స్ ఏ ఎన్ ఎం లు కాలని ప్రజలు విచ్చేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ ఉమా శంకరమ్మమాట్లాడుతూ పిల్లల యొక్క మానసిక, శారీరక, భాషా వృద్ధి, కళాత్మకతలు పెరుగుదల కొరకు అంగానిది కేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయని సిడిపిఓ మాట్లాడారు. అలాగే అంగనవాది కేంద్రాలు పిపి ద్వారా పిల్లలు ప్రాణటే స్కాడ్ ఇన్ ఏమాత్రం ఆలసిపోరని పొగిడారు. ఈసీసి ఈ డే యొక్క ప్రాముఖ్యతను తెలియ జేసి ఈ కార్యక్రమం ముగించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, అంగనవాడి ఆయాలు పాల్గొన్నారు.

## రాచనపల్లి పంచాయతీలో పీఏ బిఆర్ తాగునీటి పైపులైన్లు పనులకు భూమి పూజ


పైప్ లైన్ పనులకు భూమి పూజ చేస్తున్న టిడిపి నాయకులు.

**అనంతపురం రూరల్, జులై 26 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం రాచనాపల్లి గ్రామపంచాయతీ సిండికేట్ నగర్ సమీపంలో పి ఎ బి ఆర్ తాగునీటి పైప్లైన్ పనుల కోసం స్థానిక టిడిపి నాయకులు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఏబీఆర్ పైపుల నుంచి వచ్చే త్రాగునీరు రాజ్యాంగంపల్లి పంచాయతీ నుంచి పాపంపేట గ్రామానికి త్రాగునీరు తీసుకుపోవడం కోసం పైప్లైన్ పనులను చేపట్టడంజరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బద్దెల మంజునాథ్, యాదవ సాధికార సమితి రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షులు బిల్లా నాగరాజు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బుల్లెట్ రఫీ, కురుబ సంఘం రూరల్ మండల అధ్యక్షులు బండి ఈశ్వరయ్య, టిడిపి సీనియర్ నాయకులు ఆంజనేయులు, అక్కులప్ప, రామాంజనేయులు, టిడిపి నాయకులు వెంకట రాముడు, రవి, కిష్ట డ్రైవర్ వెంకట్రాముడు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ దండోరా జెండా అణగారిన వర్గాలకి అండ

**- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ మాదిగ**


ఎమ్మార్పిఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పిఎస్ నేతలు

**కూడేరు, జూలై 26 ప్రభాతవార్త**

78 ఏండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో 30 ఏండ్లుగా సజీవంగా నిలబడి లక్ష్యాన్ని ముద్దాడిన ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్ మాత్రమే అని, ఈ 30 ఏళ్ల కాలంలో దండోరా జెండా సమస్త పీడిత అణగారిన వర్గాలకు అండగా నిలిచిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు బండారు కదిరప్ప మాదిగలు అన్నారు. స్థానిక కరుట్లపల్లి ఎస్సీ కాలనీలో ఎమ్మార్పిఎస్ దండోరా జెండాను వారు ఆవిష్క రణ చేశారు. ఎమ్మార్పీఎస్ పట్టణ సదస్సులో వారు మాట్లాడుతూ.. ఎమ్మార్పీ ఎస్ ఉద్యమం ఆవిర్భవించిన తరువాత, మందకృష్ణ తన పేరు పక్కన మాదిగ అని చేర్చుకున్న తరువాత మాదిగ సమాజానికి ఎనలేని ధైర్యం కలిగిం దన్నారు. ఆ ధైర్యంతోనే మాదిగలంతా తమ పేరు పక్కన కులం పేరు చేర్చుకొని ఆత్మ గౌరవాన్ని చాటుకున్నారని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ రిజర్వే షన్లు జనాభా ప్రాతిపదికన అందక పోవడం వల్లనే మాదిగలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారన్నారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరిం చాలని మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 30ఏండ్లు రాజీలేని పోరాటం సాగిందని అన్నారు. ఆ పోరాట ఫలితంగానే నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో వర్గీక రణ చట్టం అమలులోకి వచ్చిందని, దాని ద్వారా మాదిగలకు 9 శాతం రిజర్వేషన్లు దక్కుతాయన్నారు. జూలై 7న జరిగిన ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకొని ప్రతి గ్రామంలో దండోరా జెండా ఆవిష్కరణలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ జిల్లా నాయకులు రాజు, లక్ష్మన్న, కరుట్లపల్లి మాజీ సర్పంచ్ రామాంజనేయులు, మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ మాదిగ, కమ్మూరు గణేష్, విహెచ్పిఎస్ కలగళ్ల ముత్యాలు, ఎంఎస్పి సత్యమయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న విహెచ్‌పిఎస్ పెద్దన్న

**కూడేరు, జూలై 26 ప్రభాతవార్త**

మండల పరిధిలోని కలగళ్ల గ్రామంలో దళిత యువకులు,కాలనీ వాసులు అంబేద్కర్ విగ్రహ నిర్మాణం చేస్తున్నందున నిర్మాణం కొరకు తన వంతు సాయంగా ఐదువేల రూపాయలను విహెచ్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఓ.పెద్దన్న కార్యనిర్వాహకులకు శనివారం నగదును అందజేశారు.ఈ సందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ దళిత యువకులు దళిత ప్రజలు అంబేద్కర్ గారి జీవిత చరిత్ర గురించి రాజ్యాంగము గురించి తెలుసుకోవాలని అంబేద్కర్ గారి విగ్రహాలు పెట్టడం వారిలో చైతన్యానికి స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కలగళ్ల యువకులు మాట్లాడుతూ ఆర్థికంగా అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని,విగ్రహాన్ని నిర్మించుటకు ఎస్సీ కాలనీలో ఉన్నటువంటి యువకులు కాలనీ ప్రజలు, అందరూ కష్టపడి నిర్మిస్తున్నామని ఎవరైనా దాతలు ముందుకు వచ్చి విగ్రహాన్ని నిర్మించుటకు వారికి తోచిన విధంగా విరాళములు అందజేయవలనని అన్నారు. ఆర్థిక సహా యాన్ని అందించినందుకు పెద్దన్నకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కలగళ్ల పెన్న ఓబులేసు,ఆంజనేయులు, నరసింహులు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, ముద్దలాపురం ఆదినారాయణ, విహెచ్పిఎస్ కలగళ్ల ముత్యాలు, కొత్త మాదిగ వన్నూరప్ప, సిద్ధప్ప,జగన్నాథ్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో అవినీతిని అడ్డుకోండి

**- వైఎస్సార్‌పీ శ్రేణులు ఎంపిడిఒకు ఫిర్యాదు**


ఉపాధి హామీపథకం పైన ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

**బుక్కరాయసముద్రం జూలై 26 ప్రభాతవార్త**

ఉపాధి హామీ పథకంలో అవినీతి అడ్డుకోండి ఫీల్డ్ అసిసెంట్లు మెట్లు కూలీల పై అక్రమ వసూళ్ళు మానుకోవాలని వైఎస్సారిపీ మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి,జడ్పిటీసీ నీలం భాస్కర్ ఆరోపించారు.శనివారం ఉపాధి హామీలో జరుగుచున్న అవినీతి అక్రమాల పై ఎంపిడిఒ సాల్మన్‌రాజ్‌కు ఫిర్యాదు చేస్తు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగావారు మాట్లడుతూ శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ల్ మేట్లు అక్రమంగా డబ్బులు వసులుచేస్తూన్నారని వచ్చిన ఆరోపనల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.ఉపాధి హామీ పథకాన్ని రాజకీయంగా లేని సామన్య ప్రజలకు ఉపయుక్తంగా రూపొందించిన అధికారులు టీడీపి కూటమి నాయకులు పెట్టిన ఫీల్డ్ అసిస్టెంట్లు మేట్లు అవినీతికి పాల్పడి ఉపాధి హామీ పథకాన్ని మసకబారుస్తున్నరని విమర్శించారు.కూలిపనులకు వెళ్లని వారిని హాజరైనట్లుగా మస్టర్లలో నమోదుచేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని తీవ్రంగా వ్యాఖ్యానించారు.ఇలాంటి అక్రమాలపై ఆరోపనలు వచ్చినప్పటికీ అధికారులు నోరుమెదపకపోవడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కూలీలనుండి డబ్బులు వసులుచేస్తు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నా అధికారుల పై ఫీల్డ్అసిస్టెంట్లు మేట్ల పై విచారన జరిపి బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.అవినీతిని తక్షనమే అరికట్టకపోతే వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున ధర్నా చేపట్టేందుకు సిద్దంగా ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వైసీపీ నాయకులు బయపరెడ్డి,చంద్రమోహన్,రోటరీపురం గంగరాజు,నాగ,నాగరాజు,రంగా,అంకే నరేష్,మాజీ డీలరు సత్తి,నాగలింగా,వెంకటేష్,ప్రసాద్,తదితిరులు పాల్గొన్నారు.

## సైనికుల యొక్క త్యాగాలు వృధా కావు

**- మై భారత్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్**

**అనంతపురం న్యూటౌన్, జూలై 26 ప్రభాతవార్త**

భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ అనంతపురం, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్.వి.డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని యువతకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ డా. ప్రసాద్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్ కుమార్, కే.జయమారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. సైనికుల త్యాగాలు వృధా కావు అని పేర్కొన్నారు. వ్యాస రచన పోటీలలో గెలుపొందిన యువతకి కేంద్ర ప్రభుత్వంచే ప్రశంసా పత్రాలు, జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మై భారత్ వాలంటీర్లు, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు వంశీ, యువతీ యువకులు పాల్గొన్నారు.

## త్వరలోనే పార్టీ నూతన కమిటీలను ప్రకటిస్తాం

**- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రకటన**


మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**అనంతపురం కలెక్టరేట్ జూలై 26 ప్రభాతవార్త**

అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించిన తెలుగుదేశం పార్టీ నూతన కమిటీలను త్వరలోనే ప్రకటిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. పార్టీ అనుబంధ కమిటీలు, నగర కమిటీల ఎంపిక పై అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ సంస్థగత ఎన్నికల పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అనంతపురం నియోజకవర్గ టిడిపి పార్టీ అబ్జర్వర్ లక్ష్మీనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఇప్పటికే కొన్నింటిపై నిర్ణయం తీసుకున్నప్పటికీ కొన్ని చోట్ల ఎక్కువ మంది పోటీ ఉన్నారు. గత ఐదేళ్లుగా పార్టీ కోసం ఎవరెవరు కష్టపడ్డారు గత ఎన్నికల్లో ఎవరు పని చేశారు.. పార్టీ సభ్యత్వ నమోదు, ప్రస్తుతం సుపరిపాలన కార్యక్రమంలో ఎవరెవరు యాక్టీవ్ గా పాల్గొంటున్నారు వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు ఉంటాయన్నారు. ఇందులో తన గెలుపు కోసం పని చేసినా పని చేయకపోయినా.. గత ఐదేళ్లలో పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అలాగే ఇటీవల పార్టీ చేపట్టిన కార్యక్రమాల్లో ఎలా పని చేశారన్నది కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ తుదిదశకు వచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సైఫుద్దీన్, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సరళ, టిడిపి ఆర్యవైశ్య నాయకుడు కృష్ణం రఘు తదితరులు పాల్గొన్నారు.

## శింగనమల సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపిడిఓ భాస్కర్


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ

**శింగనమల, జులై 26 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని శింగనమల గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఓ భాస్కర్ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన కచ్చితంగా పాటించాలని, ఎవరైనా ఉద్యోగ రీత్యా బయటికి వెళ్తే మూమెంట్ రిజిస్టర్‌లో ఒనమోదు చేసి వెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి-4 సర్వే పకడ్బందీగా అమలు చేయాలని ఆయన సూచించారు. అర్హులైన వారిని బంగారు కుటుంబంలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి తిప్పేస్వామి, విఆర్ఓ తాతయ్య, మహిళా పోలీసు శిల్పా, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో ఎమ్మార్పిఎస్ జెండా ఆవిష్కరణ చేయండి

**- ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షులు రామాంజినేయులు**


పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పిఎస్ నాయకులు

**శింగనమల, జులై 26 ప్రభాతవార్త**

ఎమ్మార్పిఎస్ గ్రామ కమిటీలు, ఎమ్మార్పిఎస్ జెండా దిమ్మెలు ప్రతి గ్రామంలో నిర్మాణ ప్రక్రియను జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షులు రామాంజినేయులు మాదిగ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రామస్వామి దేవాలయంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పిఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ముమ్మిడి వరపు చిన్న సుబ్బారావు మాదిగ సూచనల మేరకు అనంతపురం జిల్లా మండలలాల పర్యటనలో భాగంగా శింగనమల మండల గ్రామాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఎమ్మార్పిఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఎమ్మార్పిఎస్ జెండా దిమ్మెలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పిఎస్ అనంతపురం జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు బండారు కదిరప్ప, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మంజునాథ్ మాదిగలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 13వ తేదిలోపు అన్ని కార్యక్రమాలు పూర్తి చేయాలని ఆగస్టు 17వ తేదిన జిల్లాకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వస్తున్న సందర్భంగా ఆ సభను విజయవంతం చేయడానికి ప్రతి గ్రామం నుంచి ఎమ్మార్పిఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు మల్లికార్జున, ఎంఎస్పి నియోజకవర్గ కన్వీనర్ జలాలపురం ఓబులేసు, కో కన్వీనర్ శివమూర్తి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబులేసు, డప్పు కళాకారులు నాగరాజు, చంద్ర, సూర్యనారాయణ, చిట్టప్ప, గుర్రప్ప పాల్గొన్నారు.

## కూటమి పాలనలో అన్ని వర్గాలకు మోసమే

**- ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి**


ప్రభుత్వ మోసాలపై ప్రజలకు వివరిస్తున్న ఓబిరెడ్డి

**అనంతపురం సిటీ, జులై 26 ప్రభాతవార్త**

కూటమి పాలనలో అన్ని వర్గాలకు మోసం జరిగిందని వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి విమర్శించారు. బాబుషూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 24వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సంపంగి రామాంజినేయులుతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. వైసిపి పాలనలో ఆయా కుటుంబాలకు జరిగిన మేలును వివరించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కుటుంబాలకు జరిగిన నష్టాన్ని వివరించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి మాట్లాడుతూ.. వైసిపి పాలనలో ప్రతి ఇంటికీ గడప వద్దకే సంక్షేమ పథకాలు అందాయన్నారు. అయితే ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచిచ 13 నెలలు గడుస్తున్నా హామీలను విస్మరించారని విమర్శించారు. ఏ ఇంటి వద్దకు వెళ్లినా తాము మోసపోయామని ప్రజలు చెబుతున్నారని, మోసపూరిత హామీలు ఇచ్చిన కూటమి నేతలకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు నాగేంద్ర, గుజ్జల శ్రీరాములు, గుజ్జల నారాయణ, మధుసూధన్‌రెడ్డి, సాకే శివశంకర్, గిరిజన విభాగం జిల్లా కార్యదర్శి సాకే మురళీ, నగర కార్యదర్శులు సాకే మణికంఠ, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాల ఎంపిక పక్కాగా జరగాలి

**- ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు**

**అనంతపురము రూరల్, జులై 26 ప్రభాతవార్త**


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, సమావేశానికి హాజరైన పంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్ అసిస్టెంట్లు మహిళా పోలీసులు

పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి 4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాల ఎంపికను పక్కాగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్ అసిస్టెంట్ లకు, మహిళా పోలీసులకు ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు తెలియజేశారు. శనివారం అనంతపురం రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో వారు పంచాయతీ కార్యదర్శులతో, వెల్ఫేర్ అసిస్టెంట్లతో, మహిళా పోలీసులతో పి 4 సర్వే పై సమావేశం నిర్వహించి పీ 4 సర్వే ఏవిధంగా నిర్వహించాలి సర్వేకుల నిబంధనలను వారికి వివరించి పీ 4 సర్వేపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయితీలో బంగారు కుటుంబాల ఎంపిక అర్హతల పై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అవగాహన కలిగి సర్వే నిర్వహించి పీ 4 సర్వేకు గల అర్హులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని నెరవేర్చాలని, అదే విధంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే ఎన్నారైలను, ధనికులను గుర్తించాలని వారికి తెలియజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు ఆధారంగానే బంగారు కుటుంబాల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అశోక్ బాబు, ప్రవీణ్ బాబు, రవిచంద్ర, శ్రీధర్ రావు, బాబా ఫక్రుద్దీన్, మహమ్మద్ రఫీ, సర్దార్ వలి, మల్లికార్జున, గోవింద రాజులు, పద్మావతి, హైమావతి, రాజేశ్వరి, రవళి, ప్రవీణ్ కుమార్, చరణ్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సాకే వీరాంజనేయులు

**అనంతపురం రూరల్, జులై 26 ప్రభాతవార్త**


సాకే వీరాంజనేయులు

ఆంధ్రప్రదేశ్ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తెలుగు దేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి అనంత రూరల్ మండలం రాచనపల్లి గ్రామపంచాయతీ సిండికేట్ నగర్ కు చెందిన సాకే వీరాంజనేయులు ను ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. ఈ సందర్భంగా సాకే వీరాంజనేయులు మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఉన్న ప్రదేశ్ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాష్ట్ర నాయకులు నన్ను ఎన్నుకోవడం జరిగిందని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎరుకల జాతి అభివృద్ధి కోసం, ఎరుకల జాతి ఐకమత్యం కోసం, జాతి హక్కుల సాధన కోసం, సామాజిక సేవా దృక్పథంతో, అభివృద్ధే ధ్యేయంగా, జాతి ఉనికిని, ఆత్మగౌరవాన్ని కాపాడుట కోసం, సంఘం బలోపేతం చేయుటకోసం, రాష్ట్ర అధ్యక్షులు కుంభ రాంబాబు, కమిటీ సమిష్టి నిర్ణయం మేరకు జాతికి, సంఘానికి, అవసరమని భావించి నన్ను ఆంధ్రప్రదేశ్ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకోవడం శుభపరిణామం రాష్ట్ర కమిటీ సమిష్టి నిర్ణయంతో నన్ను ఏకగ్రీవ ంగా ఎన్నుకున్నందుకు నేను ఎల్లవేళలా సంఘం బలోపేతానికి కృషి చేస్తాన న్నారు. నా ఎంపికకు కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షులు కుంభ రాంబాబుకి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే చిరంజీవికి,నా తోటి రాష్ట్ర కమిటీ సభ్యులకు పేరు పేరునా ధన్యవాదాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందన్నారు.

## ఉల్లికల్లులో బాబు షూరిటీ-మోసం గ్యారంటీ

**- హాజరైన వైఎస్ఆర్ సిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి తరిమెల వంశీగోకుల్‌రెడ్డి**


ఉల్లికల్లులో టిడిపి మేనిఫెస్టోను స్కాన్ చేస్తున్న దృశ్యం

**శింగనమల, జులై 26 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఉల్లికల్లు గ్రామంలో శనివారం బాబుషూరిటీ-మోసం గ్యారెంటీ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ వైఎస్ఆర్ సిపి అధినేత వైఎస్.జగన్‌హోహన్‌రెడ్డి నిర్ణయం మేరకు గ్రామస్తుల సెల్‌ఫోన్‌లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టోను స్కాన్ చేసి వివరించారు. అనంతరం ఉల్లికంటి పల్లి, కొరివిపల్లి, అలంకరాయుని పేట, జులా కాలువ గ్రామాల్లో బాబుషూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్ఆర్‌సిపి రైతు విభాగం కార్యదర్శి తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, మండల కన్వీనర్ పూల ప్రసాద్, వైఎస్ఆర్‌సిపి నాయకులు ఉల్లికల్లు పరందామ రెడ్డి, వైఎస్ఆర్‌సిపి మైనార్టీ నాయకులు బంగారు అలీ, నిదనవాడ శ్రీకాంత్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, కృష్ణరెడ్డి, దండి శ్రీనివాసులు, ఆదిరెడ్డి, నాగలగుడ్డం దాసరి వెంకటరమణ, ఆది, శివపురం రమణ, వీరాంజినేయులు, శరత్‌రెడ్డి, వెంకటరెడ్డి, మునీంద్ర, అమర్‌నాథ్‌రెడ్డి, హరిబాబు రెడ్డి, సి.రామకృష్ణ, వెంకటనారాయణ, దామోదర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఉల్లికంటి పల్లి బాల గంగరాజు, బాలయ్య, వెంకటనారాయణ, కరుణ, జగదీష్, ముద్దయ్య, బాలు, కొరివిపల్లి గ్రామ వైసిపి నాయకులు రఘునాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాధవరెడ్డి, శంకర్, కె.ప్రభాకర్, సూరి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ దారుల ఉత్పత్తి సంఘం ఏర్పాటు


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

**బుక్కరాయసముద్రం జూలై 26 ప్రభాతవార్త**

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో వెలుగు కార్యాలయంలో శనివారం రైతు వ్యవసాయ దారుల ఉత్పత్తి సంఘం ఏర్పాటు చేసుకోవడం జరిగింది.మండలంలోని గ్రామాల్లో భూమి ఉన్న మహిళలతో మహిళా రైతు సంఘాలతో మహిళా రైతు సంఘాలు(పిఐజిఎస్) ఏర్పాటుచేసుకోవాలి, మండల స్థాయిలో మండల సమాఖ్య ఏర్పాటు చేసుకోవడం జరిగింది.ఈ సమాఖ్య యొక్క ముఖ్య ఉద్దేశం వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించు కోనేలా దళారి వ్యవస్థను లేకుండా చేసుకొనేలా వ్యవసాయ పరికరాలు వ్యవసాయానికి సంబందించిన నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, పరికరాలు గ్రూఫ్ యాక్టివిటీ ద్వారా చేసుకోవడం జరుగుతుంది. వ్యవసాయానికి సంబందిన శాఖలతో సమన్వయం చేసుకొని ఎఫ్‌పిఓ పనిచేయడం జరుగుతుంది.అనంతరం కార్యవర్గ సభ్యలను ఎన్నుకున్నారు. ఒబి మెంబర్స్ ప్రసిడెంట్ నాగరత్న,సెక్రెటరీ లక్ష్మిదేవి, ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో గంగాధర్ డిపిఎం,సుభద్రమ్మ ఎసి,అనితాదేవి ఎపిఎం,నాగలక్ష్మి ఎంఎస్ ప్రసిడెంట్,సీసీలు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- జులై 31వరకు మాత్రమే గడువు ఉంది
- శ్రీ సత్యసాయి జిల్లా రైతులకు ఇది మంచి అవకాశమన్న ఎమ్మెల్యే సునీత


ఎమ్మెల్యే పరిటాల సునీత

**రామగిరి, జులై 26 ప్రభాతవార్త**

ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాప్తాడు నియోజకవర్గ రైతులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులను ఆపద కాలంలో ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇది రైతులకు ప్రకృతి వైపరీత్యాల నుంచి ఆర్థిక రక్షణ కల్పించే కేంద్ర ప్రభుత్వ కీలక పథకమన్నారు. ఈ పథకం ద్వారా తుపాను, కరవు, అకాల వర్షాలు, వరదల వంటి సహజ విపత్తుల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. బీమా సంస్థలు నష్టాన్ని అంచనా వేసి, రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా 25 శాతం మొత్తాన్ని జమ చేస్తాయి. ముఖ్యంగా శ్రీ సత్యసాయి జిల్లాలో సాగవుతున్న వరి, మొక్కజొన్న, కందులు, రాగులు, ఆముదం పంటలకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ పంటలకు కేవలం వంద నుంచి 2వందలు మాత్రమే ప్రీమియం ఉంటుందన్నారు. అయితే మీరు ఏ పంట వేశారన్నది స్థానికంగా వ్యవసాయ అధికారులతో ధృవీకరణ పత్రాన్ని తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బీమా దరఖాస్తు కోసం రైతులు తమకు దగ్గర్లో ఉన్న బ్యాంకు బ్రాంచ్‌కి వెళ్లి చేయించుకోవచ్చని.. లేదా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు లేదా కామన్ సర్వీస్ సెంటర్స్ లేదా మీసేవకు వెళ్లి దరఖాస్తు చేయించుకోవచ్చన్నారు. ఇందుకోసం భూమి యాజమాన్య రికార్డులు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ కాపీ, పంట విత్తన ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. జులై 31వరకు మాత్రమే ఈ పథకం దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందని.. రైతులు త్వరగా ప్రీమియం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పంట ధృవీకరణ పత్రాన్ని అందించడంలో వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేకంగా చొరవ చూపాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు.

# నేర రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయం...

- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన నేరాల సంఖ్య
- ఏబీసిడీ అవార్డు జిల్లా పోలీసుల సమైక్య కృషికి నిదర్శనం
- అర్థ వార్షిక నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ వి.రత్న


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి.రత్న

**పుట్టపర్తి, జులై 26, ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని జిల్లా ఎస్పీ వి. రత్న పేర్కొన్నారు. శనివారం వివిధ శాఖల అధికారులతో పుట్టపర్తి లోని సాయి ఆరామంలో రాష్ట్ర డిజిపి హరీష్ గుప్తాఆదేశాల మేరకు అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీమతి వి.రత్న గత ఆరు నెలల్లో జరిగిన క్రైమ్ సాధించిన పురోగతి అన్ని శాఖల సమన్వయంతో ఇల్లా పోలీస్ యంత్రాంగం చేపట్టిన చర్యల గురించి, జిల్లాలో పెండింగ్లో ఉన్న గ్రేవ్ మరియు నాన్ గ్రేవ్ కేసులు హత్య కేసులు పోక్సో ,మరియు రేప్ కేసులు, దేకాయిటి ,రాబరీ ప్రాపర్టీ ,వాహనాలు దొంగతనం ,మిస్సింగ్ ,చీటింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు ఎన్ఫోర్స్మెంట్ వర్క్, పెండింగ్ ఫైల్స్, పెండింగ్ ఎన్ బి డబ్ల్యు ఎస్, ఎన్ డి పి ఎస్ కేసులలో దర్యాప్తు, రికవరీ ల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో నేరాల నియంత్రణకు ఏడాదికాలంగా ప్రత్యేక ప్రణాళికతో పటిష్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 41శాతం క్రైమ్ రేటు తగ్గిన ఏడు జిల్లాల్లో సత్యసాయి జిల్లా కూడా చోటు దక్కిందన్నారు. ప్రధానంగా హత్యలు, హత్యాయత్నాల సంఖ్య 36 శాతం తగ్గుముఖం పట్టిందన్నారు.అయితే జిల్లా వ్యాప్తంగా మహిళలు, చిన్నారులపై పెరిగిన నేరాల సంఖ్యను తగ్గించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామన్నారు. రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ను నిరంతర ప్రక్రియగా చేపట్టామన్నారు. పోక్సో కేసుల్లో కీలకమైన అంశాలపై సమావేశంలో చర్చించామన్నారు. రోడ్డు ప్రమాదాలు, వైట్ కాలర్ నేరాలు మొదలైనవి కూడా 7 శాతం చాలా వరకు తగ్గుముఖం పట్టాయన్నారు. జిల్లాలో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయడం జరిగిందని, వచ్చే గణేష్ ఉత్సవాలు, బాబా వేడుకలకు దేశ విదేశాల నుండి ఎంతోమంది ప్రముఖులు భక్తులు రావడం జరుగుతుందని ఇప్పటి నుంచే ఒక ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. జిల్లా కలెక్టర్ బాగా సహకరిస్తున్నారని అంతేగాక అన్ని శాఖల తో కలిసి పని చేస్తూ జిల్లాలో క్రైమ్ తగ్గించడంలో సమన్వయంతో ముందుకు వెళ్తామని ఎస్పీ తెలియజేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సృజనా, మాట్లాడుతూ ఫోక్సో కేసులలో అనుసరించాల్సిన పద్ధతులపై కేసుల నమోదులో పాటించవలసిన సూత్రాలను వివరించారు. ఏపీపీలు, వివిధ శాఖల నుంచి హాజరైన అధికారులు ప్రసంగించి కేసులలో న్యాయమైన సలహాలు తీసుకోవాల్సిన విషయాలపై, పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు అంశాలపై ట్రాన్స్పోర్ట్ అధికారి కరుణాసాగర్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన అన్ని శాఖల అధికారులను జిల్లా ఎస్పీ శాలువాతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. కీలక కేసులు త్వరితగతిన చేదించడం నిందితులను సత్వరమే అరెస్టు చేయడం దర్యాప్తు సకాలంలో నాణ్యతగా పూర్తి చేయడం పెండింగ్లో ఉన్న కేసులు తగ్గించడం తదితర విధులలో ప్రతిభ కనబరిచిన 57 ,మంది పోలీసు అధికారులు సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలను జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో, జిల్లా ఎస్పీతో పాటు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సృజనా, డి డి ఓ రామ్ నాయక్ , ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, జిల్లా అగ్నిమాపక అధికారి మాధవ నాయుడు, అడిషనల్ పి పి, ఏపీపీలు, లక్ష్మీనారాయణ ,పద్మజ, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, నాగేష్ , ఆదినారాయణ, శ్రీనివాస్, హరిప్రసాద్ విశ్రావు శ్యామల , డీఎస్పీలు విజయకుమార్ , నరసింగప్ప, శివ నారాయణ స్వామి, మహేష్, ఆదినారాయణ, శ్రీనివాసులు, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సృజనకు జ్ఞాపికను అందిస్తున్న జిల్లా ఎస్పీ

# 12 మంది గుప్తనిధి ముఠా సభ్యుల అరెస్టు

- పరారీలో ముగ్గురు నిందితులు
- ఒక జెసిబి, రెండు కార్లు, నాలుగు మోటర్ సైకిల్లు స్వాధీనం
- ఇత్తడి గంట, మూడు ఇత్తడి దేవత వస్తువులు స్వాధీనం


గుప్తనిధి త్రవ్వకాలకు పాల్పడిన ముఠా సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు

**కళ్యాణదుర్గం, జూలై 26 ప్రభాతవార్త :**

కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామ పరిసరాల్లో ఉన్న బిసలమల్లప్ప గుడి వద్ద గుప్త నిధులు ఉన్నాయని రుద్రంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తులు గుప్తనిధి తవ్వకాలకు పథకం రచించారు. ఈ సమాచారాన్ని తమకు తెలిసిన అనంతపురం వాసులకు సమాచారం ఇవ్వగా, వారి ద్వారా కేరళకు చెందిన గొప్ప నిధి నిపుణులను రప్పించి త్రవ్వకాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులకు రహస్యంగా అందిన సమాచారం మేరకు తెల్లవారుజామున నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. శనివారం 12 మంది గుప్త నిధి నిందితులను అరెస్టు చేసి, పత్రిక ప్రకటనను విడుదల చేశారు. పోలీసుల కథనం మేరకు నిందితుల వద్ద నుండి ఒక జెసిబి,రెండు కార్లు, నాలుగు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గుప్తనిది ఇది తవ్వకాలలో బయల్పడిన కొన్ని ఇత్తడి వస్తువులను, ఒక గంటను నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులలో రుద్రంపల్లి కి చెందిన బోయ నాగభూషణ, బోయ బొమ్మన్నతో పాటు మరో పదిమందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్కు పంపనట్లు కుందుర్పి పోలీసులు తెలిపారు.

# పక్కా ఆధారాలతోనే మద్యం కుంభకోణంలో అరెస్టులు: పరిటాల శ్రీరామ్.

మంత్రి సత్యకుమార్, అధికారులతో చర్చించి సమస్యలు తీరుస్తాం.

గుడ్ మార్నింగ్ వలన ప్రజలకు ఏం లాభం జరిగిందో అందరికీ తెలుసు.

**ధర్మవరం,జూలై27(ప్రభాతవార్త)**

రాజకీయాలు చేసేందుకు కాదు, పబ్లిసిటీ కోసం తాము మీ సమస్యమా బాధ్యత కార్యక్రమాన్ని చేపట్టలేదని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. మీ సమస్యమా బాధ్యత కార్యక్రమం రెండవ రోజు కూడా కొనసాగింది. ధర్మవరం పట్టణంలోని 17వ వార్డు సంజయ్ నగర్ లోని బండి సత్రం పాఠశాల, 18వ వార్డు గాంధీనగర్ లోని మున్సిపల్ స్కూల్ వద్ద గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం గురించి ముందు రోజే చాటింపు ద్వారా ప్రజలకు తెలియజేశారు. వందలాది మంది వచ్చి తమ సమస్యలను చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పరిటాల శ్రీరామ్ స్వయంగా ప్రజల సమస్యలను ఓపిగ్గా వింటూ.. ప్రతిఒక్క అర్జీపై స్థానిక నాయకులకు బాధ్యతలప్పగించారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి.. ఏ అధికారి వద్దకు వెళ్తే పరిష్కారం అవుతుందన్నది చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ తాము తీసుకుంటున్న ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలన్నదే మా లక్ష్యమని.. అయితే కొన్నింటికీ రాష్ట్ర స్థాయిలో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వీలైనన్ని ఎక్కువ సమస్యలకు పరిష్కారం చూపిస్తామన్నారు. దీనిపై వారు మరోసారి తమ వద్దకు రాకుండా మా నాయకులే పరిష్కారం చూపిస్తారని.. లేదంటే అది ఎందుకు జరగలేదో వివరణ కూడా ఇస్తారన్నారు. ఇది రాజకీయాల కోసం చేస్తున్న కార్యక్రమం కాదని.. ఆ రోజు మేము ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్న భరోసా ఇచ్చామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కనీసం చిన్న చిన్న సమస్యలు కూడా తీర్చకపోతే.. అది మా తప్పవుతుందన్నారు. అందుకే నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. గతంలో నాయకులు గుడ్ మార్నింగ్ కార్యక్రమం చేపట్టి ఎంత వరకు ప్రజల సమస్యల్ని పట్టించుకున్నారో అందరికీ తెలుసునన్నారు. ఫేస్ బుక్ లైవ్ లు పెట్టుకుని, లైక్‌లు, షేర్ల కోసం ఈ కార్యక్రమం చేపట్టలేదన్నారు. చిత్తశుద్ధితో ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నదే మా ఉద్దేశ్యం అన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం మంత్రి సత్యకుమార్ తో పాటు అధికారులందరితో కలిసి కూర్చొని చర్చిస్తామన్నారు. మరోవైపు మద్యం కుంభకోణంలో పక్కా ఆధారాలతోనే అరెస్టులు జరుగుతున్నాయన్నారు. వేరే ఇతర నేరాల నుంచి తప్పించుకోవచ్చు కానీ.. ఆర్థిక నేరాల నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు. మా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలంటూ వైసీపీ నాయకులు అసలు విషయాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అవినీతికి ప్రతి నాయకుడు మూల్యం చెల్లించుకుంటారని శ్రీరామ్ స్పష్టం చేశారు.

# కంబదూరులో సందడి చేసిన సినీనటి విజయలలిత

ఎన్టీఆర్ , కృష్ణ వంటి అగ్ర హీరోలతో పలు చిత్రాలలో కథానాయకగా నటించిన విజయలలిత

కంబదూరు కోడలుగా గుర్తింపు పొందిన తెలుగు క్వీన్ సినీ నటి విజయలలిత


కుటుంబ సభ్యులతో సినీనటి విజయలలిత దృశ్యం

**కంబదూరు, జూలై 26, ప్రభాతవార్త**

అలనాటి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో యాక్షన్ క్వీన్ గా పేరు సంపాదించిన సినీనటి విజయ లలిత కంబదూరు మండల కేంద్రంలో శనివారం సందడి చేశారు. మామ సమాధిని సందర్శించేందుకు విచ్చేసిన ఆమె బంధువులైన బోమి కిష్టప్ప ,గ్యాస్ వేణు ఇంటికి వెళ్ళారు. కుటుంబ సభ్యులతో కలిసి కాసేపు ముచ్చటించారు. కంబదూరు వాసి అయిన శివప్రసాద్ అనే వ్యక్తిని గతంలో ఆమె వివాహం చేసుకోవడంతో విజయ లలిత కంబదూరు కోడలయ్యారు.ఈ సందర్భంగా విజయలలిత మీడియాతో మాట్లాడుతూ కంబదూరు ప్రాంతంతో తనకు విడదీయరాని సంబంధం ఉందని తెలిపారు. తెలుగు సినీపరిశ్రమలో కథానాయకగా నటించే సమయంలో సినిమా షూటింగ్ లు ఎక్కువగా ఉండడం వలన సొంత ప్రాంతమైన కంబదూరుకు రాలేకపోయానని అన్నారు. ఇప్పుడు ఇలా బంధువులతో కలవడం చాలాసంతోషంగాఉందని మీడియాకుతెలిపారు. అలనాటి కాలంలో దాదాపు 860 చిత్రాలకు పైగా నటించినట్లు వెల్లడించారు. చివరగా విక్టరీ వెంకటేష్ నటించిన సాహస వీరుడు సాగర కన్య చిత్రంలో యాక్టర్ గా నటించినట్లు ఆమె చెప్పుకొచ్చారు. అప్పటినుంచి సినీ పరిశ్రమకు దూరంగా ఉంటూ చెన్నైలో నివాసముంటున్నట్లు ఆమె తెలియజేశారు.తెలుగు చిత్రాల్లో ఎన్టీఆర్, కృష్ణ వంటి అగ్ర హీరోలతో విజయ లలిత కథానాయక నటించిన విషయం తెలిసిందే. చాలా ఏళ్ళ తర్వాత సొంత ప్రాంతానికి విజయలలిత విచ్చేయడంతో పెద్ద సంఖ్యలో అభిమానులు ఆమెను చూసేందుకు ఎగబడుతూ ఫోటోలు తీయించుకున్నారు.

# రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ కు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థిఎంపిక...!


రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

**ధర్మవరం,జూలై26(ప్రభాతవార్త)**

ధర్మవరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ద్వితీయసంవత్సరం సీఈసీ చదువుతున్న నిఖిల్ కుమార్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతితెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థి నిఖిల్ కుమార్ ను అభినందించారు. ఐదు రోజులక్రితం అనంతపురం న్యూటౌన్ జూనియర్ కళాశాలలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ అండర్19 విభాగంలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి అనంతపురంజిల్లా జట్టు తరపున కళాశాల విద్యార్థి ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థి సెప్టెంబరు. 12,13,14 తేదీలలో సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పీడీ నాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమం లో పీడీ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కుళ్లాయిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో సరిలేవ్వరూ మీకెవ్వరూ చంద్రబాబు.

- సంక్షేమ పథకాలు అందని వారిని క్షేత్ర స్థాయిలో గుర్తిస్తాం.
- సుపరిపాలన లో తొలి అడుగు లో కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



ప్రజా క్షేత్రంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, బండ్లపల్లి సింగల్ విండో సొసైటీ అధ్యక్షులు శంకరప్ప చేత ప్రమాణ స్వీకారం చేయించిన మాజీ మంత్రి పల్లె

**కొత్త చెరువు జూలై 26 ప్రభాతవార్త**

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఎవరు సాటి లేరని, , ప్రజా సంక్షేమం కోరుకునే ఇది మంచి ప్రభుత్వమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచాయతీలో శనివారం ఏర్పాటుచేసిన ఇంటింటి కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటింటి కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో నేరుగా కలసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర కు కొంత మంది వృద్ధాప్య పింఛన్లు అందలేదని, తల్లికి వందనం పడలేదని, మా భూములు ఆన్లైన్ చేయడం లేదని పలు సమస్యలు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. పెన్షన్లు రానివారు సచివాలయం లో నమోదుచేసుకొని సదరం క్యాంపుకు వెళ్తే సంబంధించిన డాక్టర్ల నిర్ధారణ మేరకు మీకు పెన్షన్ అందుతుందని వెల్లడించారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉంటే త్వరగా అలాంటి భూములను 1బి అడంగల్ లో చేర్చే విధంగా ఆన్ లైన్ చేసి రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే రెవిన్యూ అధికారులకు సూచించారు. ఇంకా తల్లికి వందనం అందని పిల్లలు ఉంటే సచివాలయానికి వెళ్లి సంబంధిత సమస్యకు పరిష్కారం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ప్రజల క్షేమం కోరుకునే ఇది మంచి ప్రభుత్వమన్నారు. ప్రజల పరిష్కారానికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అందరి వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి ఎందుకు అందలేదో అక్కడికక్కడే లబ్ధిదారులకు సమస్యను తెలియజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఏపీ అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఎవరు సాటి రారని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. ప్రజల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు ఉండాలని కోరారు. ప్రజల కోసమే అహర్నిశలు కృషి చేస్తున్న చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో మంచి సూపరీ పాలన సాగుతోందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు బండ్లపల్లి ప్రాథమిక సహకార సొసైటీ నూతన అధ్యక్షులు. గా శంకరప్ప ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు అనంతరం మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రెసిడెంట్ శంకరప్ప చేత ప్రమాణ స్వీకారం చేయించారు ఈ సందర్భంగా శంకరప్ప మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కృషి చేస్తానన్నారు . ఈ కార్యక్రమంలో కొత్తచెరువు మండల టిడిపి కన్వీనర్లు రామకృష్ణ పట్టణ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ,, మాజీ సర్పంచ్ లు బండ్లపల్లి కిష్టప్ప, కేశప్ప, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ సురేష్,సుధాకర్ వెంకటా చలపతి సుబ్రమణ్యం సింగల్ విండో అధ్యక్షులు శంకరప్ప, డైరెక్టర్లు శ్రీనివాసులు నారాయణస్వామి, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజా అమ్ముచున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు

ఒక కేజీ గంజా స్వాధీనం


గంజాయి అమ్ముతున్న నిందితులను అరెస్టు చేసిన డిఎస్పి

**అనంతపురం కలెక్టరేట్ జూలై 26 ప్రభాతవార్త**

గంజాయి అమ్ముతున్న అనంతపురం టౌన్ మరవకమ్మ కాలనీలో నివాసముంటున్న కటిక మహమ్మద్ సాజిద్ సాదిక్, (.22 ) కడప జిల్లా పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్లో నివాసం ఉంటున్న వనం శివచరణ్ (. 22 ) ప్రస్తుతం అనంతపురంలో నివాసం ఉంటున్నాడు . శనివారం డీఎస్పీ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో వన్ న్ ఎస్ఐ శ్రీనివాస్ వారి సిబ్బందితో ఆర్టీవో ఆఫీస్ పక్కన ఉన్న అరెస్టు అరెస్టు చేసి ఒక కేజీ గంజాయి స్వాధీనం చేస్తున్నామని డీఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు. అనంతపురము టౌన్ నందు ఇటీవల కాలములో యువత, విద్యార్థులు గంజా త్రాగుడుకు బానిసై చెడు వ్యవసానలకు గురై జీవితము దారి తప్పుతున్న క్రమములో అనంతపురము జిల్లా ఎస్ వి పి జగదీష్, ఆదేశాల మేరకు. సమాచారం సేకరించామని డీఎస్పీ చెప్పారు.ఒకటవ పట్టణ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ యాదవ్ మరియు సబ్ ఇన్స్పెక్టర్ దేవలాపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి


వైఎస్ఆర్‌సిపి మండల నాయకులు, కార్యకర్తలు ఉన్న దృశ్యం

**బెలుగుప్ప, జులై 26 ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల కేంద్రంలో వైఎస్ఆర్‌సిపి కార్యాలయంలో శనివారం మండల కన్వీనర్ చిన్న మచ్చన్న ఆధ్వర్యంలో బాబుషూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ..2024లో ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా ఇంత వరకు నెరవేర్చకుండా ప్రజలను, రైతులను, ఉద్యోగస్తులను, విద్యార్థులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు ఏమైనా సమస్యలు కానీ, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తే ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ఒక పింఛన్ మాత్రమే పెంచి తల్లికి వందనంలో కూడా సరైన విధానం పాటించ లేదని, ఆడబిడ్డ నిది లాంటి ఎన్నో హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని గట్టెక్కిన చంద్రబాబు మరల మోసం చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా మండలంలోనే మండల కమిటీలు, ఇంటింటికీ వెళ్లి బాబు చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేస్తూ గ్రామాలలో కూడా గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తూ ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించాలని, వైఎస్ఆర్‌సిపి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం మండల నాయకులు మాట్లాడుతూ.. మండలంలో కానీ, గ్రామాల్లో కానీ వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శివలింగప్ప, రాష్ట్ర బిసి సెల్ నాయకులు శ్రీనివాసులు, మండల యువజన అధ్యక్షులు భరత్‌రెడ్డి, రామిరెడ్డి, దేవానందరెడ్డి, రుద్రానందరెడ్డి, శ్రీనివాసులు, పురుషోత్తమ, గోవిందునాయక్, రాము, ప్రసాద్, శంకర్‌నాయక్, బొజ్జెనాయక్, రుద్రానంద, శ్రీనివాసులు, భక్త ప్రహ్లాద, వెంకటేషులు, ప్రసాద్, తిప్పేస్వామి, వైఎస్ఆర్ పార్టీ టజిల్లా కార్యదర్శి ఈరన్న, వైఎస్ఆర్‌సిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరసనలకు అనుమతులు లేవు

-డీఎస్పీ విజయ్ కుమార్

**పుట్టపర్తి (కల్చరల్), జూలై 26, ప్రభాతవార్త**

ఈనెల28న చలోకలెక్టరేట్ ముట్టడికి పోలీసుల అనుమతులు కోరుతూ పెట్టుకున్న దరఖాస్తులను శాంతిభద్రం దృష్టిలో ఉంచుకొని వాటిని తిరస్కరిస్తున్నట్లు పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ముద్దుగుబ్బ ఎంపీపీ గోడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్, భూ అరాచకాలను నిరసిస్తూ చలో కలెక్టరేట్ ముట్టడి కోసం, ఆర్ శ్రీనివాస్ నాయక్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కటారు గంగాధర్ యాదవ్, బీసీ సంఘం ,యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు, బుల్లె సుధీర్ మాల మహానాడు ఎమ్మార్పీఎస్ సంఘం జిల్లా అధ్యక్షులు, పఠాన్ సలాం ఖాన్ ముస్లిం మైనార్టీ మరియు నూర్ భాషా సంఘం జిల్లా అధ్యక్షులు, కూడా విడివిడిగా మొత్తం నలుగురు దరఖాస్తులు చేసుకున్నారని, అయితే ఇప్పటికే కలెక్టర్ కార్యాలయం దగ్గర ఎటువంటి ధర్నాలు ,ఆందోళనలు చేపట్టకూడదని జిల్లా ఎస్పీ వివిధ ప్రజా సంఘాలు, పార్టీలకు ,ట్రేడ్ యూనియన్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ విషయాలన్నిటినీ దృష్టిలో ఉంచుకొని, ధర్నాలు ఆందోళనలు చేపట్టేవారు ఆర్డిఓ కార్యాలయం ఏరియాలో ధర్నాచౌక్‌గా నిర్ణయించడం జరిగిందిని తెలిపారు. ఈవిధంగా ఎవరైనాకానీ ఒకరి వ్యక్తిగల కారణాల కొరకు వారి వారి వ్యక్తిగత అజెండాలను దృష్టిలో పెట్టుకొని ధర్నాలు చేయడం శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలుగా పోలీసు వారు భావించి అటువంటి వాటిని తిరస్కరించడం జరిగిందన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరు నిబంధనలను అతిక్రమించరాలని డీఎస్పీ హెచ్చరించారు.